నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, గురువారం 11 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM




నీరు లేని బోరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన (ఫైల్)

# ఊరంతా ఒకటే చేతిపంపు

- 'కరకవాగు బంజార కాలనీ'లో తాగునీటికి తండ్లాట
- పైసలిచ్చి నీళ్లు కొనుక్కుంటున్న గ్రామస్తులు
- మిషన్ భగీరథ పైపులైన్ లేని వైనం
- 'రైల్వే' పర్మిషన్ లేదంటున్న పాల్వంచ మున్సిపల్ అధికారులు
- ఇతర మార్గాల్లో నీరు అందించకుండా ఏళ్ల తరబడి నిర్లక్ష్యం
- వేసవిలోనైనా ట్యాంకర్ పంపించాలని గ్రామస్తుల వేడుకోలు



పాల్వంచ పట్టణంలో తాగునీరు లేని కరకవాగు బంజార కాలనీ

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : పాల్వంచ పట్టణ పరిధిలోని కరకవాగు బంజార కాలనీలో తాగునీటి కోసం గ్రామస్తులు తండ్లాడుతున్నారు. చాలాయేండ్లుగా అదే పరిస్థితి ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పాల్వంచ మున్సిపల్ పరిధిలో ఉన్న ఈ బంజార కాలనీలో 75 కుటుంబాల వారు నివాసముంటున్నారు. ఊరు మొత్తంలో పనిచేసే ఒకే ఒక చేతిపంపు ఉంది. అందులోనూ నీరు అరకొరగానే వస్తుంటాయి. దీంతో గ్రామస్తులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఇక వేసవిలో అయితే బాధలు వర్ణనాతీతం. పక్కనే ఉన్న పునుకుల గ్రామానికి వెళ్లి తాగునీరు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఆ గ్రామస్తులది.

### మిషన్ భగీరథ పైపులైన్ లేదు..

జిల్లా అంతటా మిషన్ భగీరథ పైపులైన్ వేసినా అక్కడ మాత్రం లేకపోవడంతో గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా తాగునీటి కష్టాలు పడుతున్నారు. ఇక ఆ గ్రామానికి భగీరథ నీరు రాదని వారు నిర్ణయానికొచ్చారు. మరి వేరే నీరన్నా అందిస్తారా.. అంటే అదీ లేదు. అధికారులు వచ్చి హడావుడి చేయడం తప్ప వారి సమస్యకు మోక్షం లభించడం లేదు. ఇటీవల కొత్తగా వచ్చిన అదనపు కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి అవాక్కయ్యారు. నీటి సమస్యను ఇంత కాలం పై అధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉన్న మున్సిపల్ అధికారులు భగీరథ పైపులైన్ వేయడానికి రైల్వే అధికారులు అభ్యంతరం తెలిపారని చెప్పారు. వీలైనంత త్వరగా పైపులైన్ వేయాలని ఆ అధికారి ఆదేశించడంతో సమస్య కొలిక్కి వస్తుందని గ్రామస్తులు భావిస్తున్నారు. ప్రస్తుతం పైసలిచ్చి నీళ్లు కొనుగోలు చేసుకునే గ్రామం ఉందంటే అది కరకవాగు బంజార కాలనీ అని చెప్పక తప్పదు. వాటర్ టిన్ను పది రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నారు.



### వేసవిలో ట్యాంకర్ పంపించండి సారూ..

చాలా కాలం నుంచి మా గ్రామంలో నీటి సమస్య ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు. మొన్ననే కొత్త మేడం వచ్చారు.. చూశారు వెళ్లారు.. త్వరలో నీళ్లు వస్తాయని చెప్పారు. పక్క ఊరు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. పాల్వంచ పట్టణానికి దగ్గరగా ఉన్నప్పటికీ మా ఊర్లో నీరు లేదు. ఏమిటి అంటే రైల్వేవాళ్లు పైపులైన్ వెయ్యనివ్వడం లేదంటున్నారు. అధికారులు కనికరం చూపి కనీసం వేసవిలోనైనా ట్యాంకర్‌తో నీరు అందిస్తే చాలు.

– జి.నీలాదేవి, కరకవాగు బంజార కాలనీ



### నీటి కష్టాలు పడలేకపోతున్నాం..

కూలీ చేస్తే గాని పూట గడవని మాకు నీళ్లు కూడా కొనుక్కోవాల్సి వస్తున్నది. అధికారులంతా మా గ్రామం నుంచే వెళతారు. ఆగుతారు.. చూస్తారు.. నీరు ఇవ్వండి సారూ అని అడిగితే వస్తుందని చెబుతున్నారు. మరి ఎప్పుడిస్తారో తెలియడం లేదు. వచ్చినప్పుడల్లా అందరం కలిసి అడుగుతున్నాం. తాగడానికి చుక్కనీరు కూడా మా గ్రామంలో లేదు. ఇప్పటికీ మేము చేతిపంపు దగ్గరకు వెళ్లి ఇంట్లో అవసరాలకు వాడుకునేందుకు నీరు తెచ్చుకుంటున్నాం.

– టి.తార, కరకవాగు బంజార కాలనీ



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

## సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

### నోడల్ అధికారుల సమీక్షలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 10 : పార్లమెంట్ ఎన్నికల్లో తమకు కేటాయించిన విధులను నోడల్ అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నామినేషన్ సహాయక కేంద్రాల ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉంటుందని, ఇందుకు సంబంధించి సామగ్రి, ఎలక్షన్ కమిషన్ నుంచి వచ్చిన ప్రింటెడ్, బ్లాక్ నామినేషన్ పత్రాలన్నింటినీ సరిచూసుకోవాలన్నారు. 85 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, ఎస్సెన్షియల్ సర్వీసెస్‌లో పనిచేసే వారు ఫారం 12,12ఏ తీసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించిన వారికి తిరిగి అవకాశం ఇవ్వాలని సూచించారు. మే 3వ తేదీ నుంచి హోమ్ ఓటింగ్ చేపట్టాలన్నారు. సెగ్మెంట్లలో ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరచడానికి మండల స్థాయిలో భద్రతతో కూడిన స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్, అదనపు డీసీపీ ప్రసాదరావు పాల్గొన్నారు.

### పల్లె దవాఖాన తనిఖీ

రఘునాథపాలెం, ఏప్రిల్ 10 : పల్లె దవాఖానల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. వీ వెంకటాయపాలెం పల్లె దవాఖానను బుధవారం తనిఖీ చేసిన ఆయన ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా మందులు ఇవ్వాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు ఎంత మంది పిల్లలకు ఇచ్చారు? ఇంకా ఎంత మందికి ఇవ్వాలి? అనే దానిపై ఆరా తీశారు. పాము, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలకు వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, డాక్టర్ బాలకృష్ణ, ఏఎన్ఎం పుష్పలత ఉన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు

### రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మణుగూరుటౌన్, ఏప్రిల్ 10 : భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. బుధవారం మణుగూరులోని డీవీ ఫంక్షన్ హాలులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలు దేశ భవిషత్‌ను నిర్ణయిస్తాయన్నారు. తరతరాలుగా బడుగు బలహీన, అణచివేతకు గురైన వర్గాలకు ఆత్మగౌరవం ఇచ్చిన రాజ్యాంగం ఉండాలా? మార్చాలా? అనే అంశాన్ని రానున్న ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దారపోస్తున్న మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. అనంతరం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంత్రి సీతక్కను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ నాయకుడు బట్టా విజయ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

- బుధవారం సాయంత్రం కనిపించిన నెలవంక
- ముగిసిన ఉపవాస దీక్షలు
- ముస్తాబైన ఈద్గాలు
- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన ముస్లింలు

# నేడు రంజాన్

రామవరం, ఏప్రిల్ 10 : పవిత్ర రంజాన్ మాసంలో చేసిన 30రోజుల ఉపవాస దీక్షలు షవ్వాల్ మాసం నెలవంక కనిపించడంతో ముగిశాయి. బుధవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో గురువారం రంజాన్ పండుగ జరుపుకోవాలని మతగురువులు నిర్ణయించారు. దీంతో ఈద్–ఉల్–ఫితర్ నిర్వహించుకునేందుకు ఈద్గాలను ముస్తాబు చేశారు.

### ఈద్– ఉల్ – ఫితర్ అంటే..

నెలరోజులు రంజాన్ దీక్షలు పాటించిన ముస్లింలు మాసం అనంతరం షవ్వాల్ మాసపు మొదటి రోజు జరుపుకునే పండుగే ఈద్– ఉల్– ఫితర్ అంటారు. నమాజ్ చేసిన అనంతరం ఇష్రాఖ్ సమయం ప్రారంభమైన తర్వాత ఈద్– ఉల్ – ఫితర్ రెండు రకాత్‌గా నమాజ్ చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఈద్– ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ధనికులు, పేదలు అనే తేడా లేకుండా సమాజంలోని అందరూ ఒకే విధమైన దినచర్యను పాటిస్తారు. తామంతా ఒకే భావన, ప్రేమాభిమానాలను నెలకొల్పడంలో ఈ పండుగ ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

### ఫిత్రాదానం..

షవ్వాల్ మాసపు మొదటిరోజు ఈద్ – ఉల్ – ఫితర్ పండుగ నాడు నమాజ్ ప్రార్థనలకు ముందు పేదలకిచ్చే దానమే ఫిత్రా... అందుకే ఈ పండుగకు ఈద్– ఉల్ – ఫితర్ అని పేరు వచ్చింది. షరియత్ పరిభాషలో ఫిత్రా అంటే ఉపవాసాల పాటింపులో మనిషి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పొరపాట్లు, లోపాలు జరుగుతూనే ఉంటాయి. ఆ లోపాల పరమార్థం చేసేదే ఫిత్రాదానం. సమాజంలోని నిరుపేదలు, దారిద్రరేఖకు దిగువన ఉన్నవారికి ఈ దానం చేస్తారు. పావు తక్కువ రెండుకిలోల గోధుమల తూకానికి సరిపడా పైకాన్ని కడు పేదలకు దానం చేయాలి. ఈద్ నమాజ్ కోసం ఈద్గాకు వెళ్లేటప్పుడు అల్లాహ్ అక్బర్, లాయిలాహ ఇల్లాల్లాహు వల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ మిలిల్లాహిల్ హమ్ద్ అనే తక్బీర్‌ను పఠించాలి. అంతేకాకుండా ఈద్గాకు వెళ్లేటప్పుడు కాలినడకన ఒక దారిన వెళ్లి వచ్చేటప్పుడు మరో దారిలో రావడం ఉత్తమం.



ముస్తాబైన ఈద్గా

### ఈద్–ఉల్–ఫితర్ నమాజ్ ప్రత్యేకం

ఈద్– ఉల్– ఫితర్ నమాజ్ కోసం ఈద్గాలు ముస్తాబు చేశారు. ఫజర్ నమాజ్ అనంతరం ఇష్రాఖ్ నమాజ్ సమయం ప్రారంభమైన తర్వాత ఈ నమాజ్ చేస్తారు. నమాజ్ కోసం ఆజాన్, ఆజాఖత్ చెప్పనవసరం లేదు. ఇమామ్‌లు ఈద్–ఉల్ – ఫితర్ గురించి ఉపదేశించి నియమాలు వివరిస్తారు. నమాజ్ అనంతరం ఖుద్బాను పఠిస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. హితులు, స్నేహితులను ఇంటికి పిలిపించి షీర్‌ఖుర్మాను అందజేస్తారు.

### ముస్లింలకు ప్రముఖుల రంజాన్ శుభాకాంక్షలు

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం, ఏప్రిల్ 10 : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ముస్లింలకు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం పార్లమెంటు సభ్యుడు నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు ఉన్నారు. ముస్లింలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచానికి ఆదర్శమని, ప్రతిఒక్కరూ ఆయన చూపిన శాంతిమార్గంలో పయనించి, శాంతిని నెలకొల్పేందుకు కృషిచేయాలన్నారు. సమాజంలో శాంతి సామరస్యం, కరుణ పెంపొందాలని అందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని కోరారు.

## రెండో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు

భద్రాచలం, ఏప్రిల్ 10 : వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం రెండో రోజుకు చేరాయి. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు మండలావాహన, కుంభావాహన, చతుస్థానార్చన, దేవతావాహన తదితర కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం యాగశాలలో సంప్రదాయబద్ధంగా హోమం నిర్వహించిన అర్చకులు తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ జరిపారు.

### చురుకుగా శ్రీరామ నవమి ఏర్పాట్లు

ఇప్పటికే ఖమ్మం, కొత్తగూడెం రైల్వేస్టేషన్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, ఆర్చీలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో కరపత్రాలను అతికించారు. మిథిలా స్టేడియంలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు 26 సెక్టార్లను ఏర్పాటు చేశారు. సెక్టార్లలోని భక్తులకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు భద్రాచలం ఆర్డీవో దామోదరరావు సమావేశం నిర్వహించి.. అధికారులకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు సహకరించాలని సూచించారు. ముఖ్యంగా శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును ఆదేశించారు. సెక్టార్లలో ఎప్పటికప్పుడు ఖాళీ వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు ఉండకుండా చూడాలని, అలాగే పట్టణాన్ని జోన్లుగా విభజించి ఎప్పటికప్పుడు చెత్తను ఏరివేసి శుభ్రంగా ఉంచాలన్నారు. 24 గంటలపాటు పారిశుధ్య సిబ్బంది మూడు షిఫ్టుల్లో పని చేసే విధంగా చూడాలని చెప్పారు. ఇప్పటికే పట్టణంలోని ప్రధాన వీధులు, శివారు ప్రాంతాల్లో స్వాగత ద్వారాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. చలువ పందిళ్లు, చాందినీ వస్త్రాలతో షామియానాలు వేశారు.

### నవమి వేడుకలపై విస్తృత ప్రచారం



తిరువీధి సేవకు బయలుదేరిన సీతారామ, లక్ష్మణమూర్తులు











## రంజాన్ రద్దీ



ఖమ్మం నగరంలోని కమాన్ బజార్, కస్బా బజార్, అజీజ్ గల్లీ తదితర ప్రాంతాలు రంజాన్ వస్తువుల కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండుగ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో నూతన వస్త్రాలు, వివిధ రకాల సేమియా ప్యాకెట్లు, సెంటు సీసాలు, ఫ్యాన్సీ ఐటెమ్స్, చెప్పులు ఇలా తీరొక్క వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీపడ్డారు. బుధవారం సాయంత్రం ఆయా ప్రాంతాల్లో కాలుతీసి కాలు వేయలేని పరిస్థితి నెలకొన్నది. ఒకరోజు ముందే రంజాన్ వచ్చినట్లుగా సందడి కనిపించింది.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం





## ఆరోగ్యంపై దృష్టి పెట్టండి..

### భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్




వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 10 : ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచడం, ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడమే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రాముఖ్యత అని అన్నారు. వాతావరణం, పర్యావరణ కాలుష్యం, సామాజిక పరిస్థితులు, ప్రకృతి విపత్తులు తదితర అనేక అంశాలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గొల్లపూడి భానుమతి మాట్లాడుతూ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన మందులు కూడా ఉచితంగా అందిస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బత్తుల రామారావు, కే.సాయిశ్రీ, ఏపీపీ పోసాని రాధాకృష్ణమూర్తి, ఏజీపీ ఏపూరి బాబురావు, తోట మల్లేశ్వరరావు, గాజుల రాంమూర్తి, శెట్టిపల్లి వెంకట రామారావు, చిరంజీవిరావు, ఎర్రపాటి కృష్ణ, వై.నాయుడు, మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సు తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో అప్రమత్తత ముఖ్యం

### మావోయిస్టుల కదలికలపై గట్టి నిఘా పెట్టాలి

### పోలీస్ అధికారుల సమీక్షలో భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 10 : పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పోలీస్ అధికారులతో ఎస్పీ బుధవారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏజెన్సీ ప్రాంత ఠాణాల్లో పనిచేసే అధికారులంతా మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని పోలీస్‌స్టేషన్లలో పనిచేసే అధికారులు మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఏజెన్సీ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు, అక్కడి ప్రస్తుత పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలోని పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు సందర్శిస్తూ భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఆయా ప్రాంత ప్రజలకు అండగా ఉంటూ.. వారి సమస్యలను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఏజెన్సీ సరిహద్దు గ్రామాల ప్రజలు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని.. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు పాటుపడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీశ్‌కుమార్, మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి, ఏజెన్సీ ప్రాంత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.